ప్రగతి పథంలో పేదల కాలనీలు

- 41వ డివిజన్‌లో అభివృద్ధి పరుగులు
- రూ.7.47 కోట్లతో మౌలిక సదుపాయాలు
- డీబీటీ ద్వారా రూ.19.54 కోట్ల లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా రూ.6.25 కోట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల కాలనీలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 41వ డివిజన్ విస్తీర్ణంలో చాలా చిన్నది. జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉంది. డివిజన్ కొంత భాగం కృష్ణానదికి జాతీయ రహదారికి మధ్య ఉంటుంది. ఈ ప్రాంతంలోని మసీదు రోడ్డు, రంగూన్ సాహెబ్ వీధి, ప్రెసిడెంట్ వీధి, మీరా సాహెబ్ వీధుల తోపాటు ఎస్సీ కాలనీ ప్రాంతాలు జాతీయ రహదారి కంటే పల్లంలో ఉన్నాయి. దీంతో వర్షాకాలంలో నీరు వెళ్లే మార్గం లేక ఇళ్లలోకి వరద వచ్చి చేరుతుంది. దీనికి తోడు దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేర్‌హౌసింగ్ 72 పాకల బజారులో సమస్యలు తిష్టవేసి ఉన్నాయి. తాగునీటి సమస్య, మురుగు సమస్యతో డివిజన్ ప్రజలు సతమతవుతున్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఈ ప్రాంత ప్రజల సమస్యలు విన్న వారు, పట్టించుకున్న వారు లేరు. దీంతో ఏళ్లకు ఏళ్ల సమస్యలతో సహ జీవనం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వారే కార్పొరేటర్లుగా పనిచేసినా సమస్యల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించలేదు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని భాగమే అయినప్పటికీ పూర్తిగా వెనుక బడిన ప్రాంతాలకంటే అధ్వానంగా మారింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్ల పునర్విభజన జరిగింది. ఈ డివిజన్ నుంచి అధికారపార్టీకి చెందిన అభ్యర్థి కార్పొరేటర్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి డివిజన్‌లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వాటర్ పైపులైన్లు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. ఈ ప్రాంతంలో నివసించే పేదలకు ప్రభుత్వం నవరత్నాల పథకాల ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించింది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకం ద్వారా 57 నెలల కాలంలో లబ్ధిదారుల ఖాతాలో రూ. 19.54 కోట్లు జమ అయ్యాయి. ఇవి కాక రూ.6.25 కోట్లు నాన్ డీబీటీ ద్వారా అందించారు. డివిజన్‌లోని పల్లం ప్రాంతంలోని ప్రెసిడెంట్ వీధి, రంగూన్ సాహెబ్,మీరా సాహెబ్ వీధులను ఎత్తు పెంచి సీసీ రోడ్లు వేశారు. వేర్ హౌసింగ్ సమీపంలోని 72 పాకల ప్రాంతంలో కాలి నడక దారులను సైతం సీసీ రోడ్లుగా మార్చి అభివృద్ధి చేశారు. డ్రెయిన్లు నిర్మించారు. దర్గా, ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి మోటార్ ఏర్పాటు చేసి ఇంటింటికి నీరు అందిస్తున్నారు. స్వాతి థియేటర్ వద్ద కల్వర్టు నిర్మాణం చేసి వర్షపు నీరు, మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఖబరస్తాన్‌కు అతి పొడవైన ప్రహరీ నిర్మించారు. శ్మశాన వాటిక అంతర్భాగంలోని పిచ్చి మొక్కలు కంప చెట్లను తొలగించి రోడ్లు నిర్మించారు. అంతిమ సంస్కారానికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పూర్తి సౌకర్యాలతో అభివృద్ధి పరిచారు. 57 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో డివిజన్‌లో ఏ వీధి చూసినా సీసీ రోడ్లు, డ్రెయినేజీలతో కళకళ లాడుతోంది. చివరికి చిన్న చిన్న నడక దారులు సైతం సీసీ రోడ్లు వేశారు. అభివృద్ధి అంటే ఇది కదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.


ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ


ముస్లిం శ్మశాన వాటిక లోపలి భాగం


ఎత్తు పెంచి సీసీ రోడ్డు వేసిన ప్రెసిడెంట్ వీధి



నాన్ డీబీటీ ద్వారా..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
ఇంటి స్థలాలు	87	29,34,960
జగనన్న విద్యాకానుక	420	9,52,087
బైజూస్ ట్యాబ్స్	44	37,73,916
జగనన్న తోడు	102	11,81,856
జగనన్న గోరుముద్ద	167	16,84,304
సంపూర్ణ పోషణ	372	69,65,118
వైఎస్సార్ కంటి వెలుగు	63	6,24,141
ఇంటింటికీ రేషన్	989	2,07,75,392
మొత్తం		6,25,86,175

ప్రత్యక్ష నగదు బదిలీ పథకం

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూ.లలో
జగనన్న అమ్మ ఒడి	702	2,92,37,700
జగనన్న విద్యాదీవెన	405	1,85,90,968
జగనన్న వసతి దీవెన	346	55,74,964
జగనన్న రైతు భరోసా	234	1,08,84,150
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	40	8,90,189
సున్నావడ్డీ పంట రుణాలు	25	63,280
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	32	3,31,822
వైఎస్సార్ పెన్షన్ కానుక	785	7,01,91,750
వైఎస్సార్ చేయూత	365	1,53,37,500
వైఎస్సార్ ఆసరా	743	1,79,08,256
వైఎస్సార్ సున్నావడ్డీ(గ్రూపు)	1058	1,06,21,630
వైఎస్సార్ కాపు నేస్తం	30	12,60,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	64	17,25,000
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	225	1,04,22,196
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	136	11,35,075
హౌసింగ్	191	16,87,653
వైఎస్సార్ బీమా	10	17,30,000
వైఎస్సార్ వాహన మిత్ర	66	19,72,009
వైఎస్సార్ నేతన్న నేస్తం	5	12,95,000
వైఎస్సార్ చేదోడు	86	19,70,000
కోవిడ్ సాయం	964	9,64,000
జగనన్న తోడు(వడ్డీ)	20	32,78,816
మొత్తం		19,54,57,289

గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి



డివిజన్‌లో పల్లపు ప్రాంతం ఎక్కువ. వర్షకాలం వరద, మురుగు సమస్య ఉండేది. గత ప్రభుత్వ రోడ్లను ఎత్తు పెంచలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించారు. రోడ్లను ఎత్తు పెంచి సీసీ రోడ్లు వేశారు. ముఖ్యంగా కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశారు.

–జోసెఫ్ శివమణి,

సమస్యలు పరిష్కరించా



గతంలో ఎంతో మంది ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తులు కార్పొరేటర్లుగా పనిచేశారు. ఏ ఒక్కరూ ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే చిన్న వీధుల నుంచి ప్రధాన రహదారుల వరకు అన్నింటినీ పూర్తిగా అభివృద్ధి చేశాం. కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించాం. డివిజన్ రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. చక్కటి సదుపాయాలు వచ్చాయి.

– ఎండీ ఇర్ఫాన్ , కార్పొరేటర్

క్లుప్తంగా

సాహిత్యం సమకాలీనమై ఉండాలి



విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ప్రస్థానం సాహిత్య మాసపత్రిక సంపాదకుడు తెలకపల్లి రవి అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం సాహిత్య ప్రస్థానం 20 ఏళ్ల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభను నిర్వహించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ సాహిత్యంలో సామాజిక జీవన చిత్రీకరణ కనిపించాలని సూచించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. సాహిత్య ప్రస్థానం విలువలతో కూడిన వ్యాసాలను ప్రచురించిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ జి.అనిత, ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, సాహితీవేత్త శాంతిశ్రీ సంచిక విశేషాలను వివరించారు.

కొత్తపేట పీఎస్‌లో మహిళా దినోత్సవం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తపేట సీఐ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఎస్ఐ దేవసుధ, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులను సత్కరించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి వాచీలు, చీరలను సీఐ అందజేశారు. మహిళలను గౌరవించాలని, ఎక్కడ అయితే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతల దీవెనలు అందించడబడతాయని సీఐ గణేష్ పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నానన్నారు.

వృద్ధాశ్రమానికి కూలర్ బహూకరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్యవైశ్య సేవా సంఘం గొల్లపూడి ఆధ్వర్యంలో ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని వెంకట సాయి వృద్ధాశ్రమానికి ఎయిర్ కూలర్‌ను బహూకరించారు. మద్దాలి కన్యాకుమారి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె భవ్య సాయి అనూష ఈ కూలర్‌ను వృద్ధాశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమంలోని వృద్ధులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కూలర్‌ను బహూకరించామని తెలిపారు. సేవా కార్యక్రమాలకు ప్రతీకగా నిలిచిన ఆర్యవైశ్య సేవా సంఘం తరుపున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సంఘం ప్రెసిడెంట్ మద్దాలి శ్రీనివాస్ కుమార్, సెక్రటరీ చెన్న పద్మావతి సాంబ శివరావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విజయదుర్గా ఆలయంలో చండీహోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం చండీ హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో అర్చకులు హోమాన్ని జరిపారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు తమ నామ గోత్రాలతో హోమాన్ని జరిపించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి ఉభయదాతలకు వేద ఆశీర్వచనం అందజేశారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రతి నెలా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వృద్ధురాలిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి 10 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శ్రీనివాస మహాల్ సమీపంలో ఓ వృద్ధురాలు మద్యం విక్రయిస్తుండటంతో దాడి చేశారు. వృద్ధురాలి చేతి సంచిలో 10 బీర్ బాటిల్స్‌ను గుర్తించిన సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర నిందితురాలిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మేము సైతం 'సిద్ధం' అంటూ నినదించిన పార్టీ శ్రేణులు


సీఎం జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ఆసిఫ్, గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభ కార్యక్రమాన్ని ఆసాంతం తిలకించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు మేము సైతం 'సిద్ధం' అంటూ నినదించారు. విద్యాధరపురం బైపాస్ రోడ్ పక్కన ఉన్న పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో 'సిద్ధం ' సభను చూసేందుకు టీవీ ఏర్పాటు చేశారు. సభకు హాజరైన లక్షలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను చూసి పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు కేరింతలు కొట్టారు.

రాళ్లు వేయించిన ఘటన మరిచి పోలేదు

షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. గతంలో ఎన్డీఏలో ఉన్న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు ఏం ఒరగబెట్టాడని ఎద్దేవా చేశారు. ఇక మోదీతో సహా బీజేపీ నాయకులు కూడా గతంలో చంద్రబాబు తమను పెట్టిన ఇబ్బందులు, తిట్టిన తిట్లు, అమిత్ షాపై తిరుపతిలో రాళ్లు వేయించిన ఘటన మరిచి పోలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సీఎం జగనన్న వెనుకే ఉంటూ ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునే వరకు నిద్రపోమని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు యర్రగ ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పొత్తులతో అవకాశవాద రాజకీయాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడం చంద్రబాబు సిగ్గులేని నీచ, అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలందరూ ఆనందంగా, భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి జాగారం చేస్తే చంద్రబాబు మాత్రం బిక్కుబిక్కుమంటూ ఢిల్లీలో బీజేపీ పెద్దల అపాయింట్‌మెంట్ కోసం జాగారం చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు బాకాలు ఊదిన కొందరు మైనారిటీ సోదరులు కళ్లు తెరవాలని సూచించారు.

మైనార్టీల ద్రోహి చంద్రబాబు

54వ డివిజన్‌లో పర్యటించిన ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామని తెలంగాణాలో ప్రకటించిన బీజేపీతో చంద్రబాబు ఎలా పొత్తు పెట్టుకున్నాడని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ప్రశ్నించారు. చంద్రబాబు మైనార్టీల ద్రోహి అని మరోసారి స్పష్టమైందన్నారు. నియోజకవర్గంలోని 54వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ఆసిఫ్ కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యలను. అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ పొత్తు రాష్ట్రానికి ప్రమాదకరం

ఆసిఫ్ మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్‌లు పొత్తుల రాజకీయాలను చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందన్నారు. దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లే సిగ్గు లేని దిగజారుడు రాజకీయ నేత చంద్రబాబునాయుడు అన్నారు. ఒంటరిగా వెళ్లే ధైర్యం చేయలేక పొత్తులకు ఎగపడ్డారని ఎద్దేవా చేశారు. టీడీపీ పొత్తు రాష్ట్రానికి ప్రమాదకరమని వివరించారు. మహంతీపురం ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి వించిపేట వరకు కొనసాగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, చైతన్యరెడ్డి, ఇర్ఫాన్, ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి, పూర్ణచంద్రరావు, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు తోలేటి శ్రీకాంత్, మజ్జి శ్రీను, కంపా గంగాధరరెడ్డి, నజీర్, శబాషి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

యాదవ ఆత్మీయ సమ్మేళనానికి విశేష స్పందన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీలను అణగదొక్కిన దుర్మార్గుడు చంద్రబాబు అయితే బీసీల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్ పేర్కొన్నారు. పశ్చిమ నియోజక వర్గానికి చెందిన యాదవ సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాలప్రాజెక్టు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షేక్.ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ విచ్చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ఆసిఫ్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో బీసీలను అత్యంత దారుణంగా అవమానించిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. బీసీలను తోకలు కట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడితే వారిని సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో మరో మారు బీసీలను మోసం చేసేందుకు బీసీ డిక్లరేషన్ అంటూ మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న యాదవ సోదరుడు తిరపతిరావును మైలవరం అభ్యర్థిగా జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆసిఫ్ గుర్తు చేశారు. ప్రభుత్వానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బీసీలకు అండగా వైఎస్సార్ సీపీ

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వంలో కూడా అమలు కాని సంక్షేమ పథకాలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గడిచిన 50 ఏళ్లలో బీసీలకు అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీయేనన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, యాదవ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, మాజీ డెప్యూటీ మేయర్ గోగుల రమణారావు సమ్మేళనానికి విచ్చేసిన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి, వేణుగోపాల స్వామి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తిరుపతిరావు యాదవ్, ఐతా కిషోర్, కోలా రజనీ, దిద్దుకూరి శివ, ఆత్మారాం, దూది బ్రహ్మయ్య, ఆంజనేయులు, గొలగాని శ్రీను, రామకృష్ణ, సూరిబాబు, వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు.


యాదవ సమ్మేళనంలో ఐక్యత చాటుతున్న నాయకులు

కాపులకు నిజమైన తోడు వైఎస్ జగన్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి నిజమైన తోడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ కాపు ఆత్మీయ సమ్మేళనం పాతబస్తీలోని మాడపాటి క్లబ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం జరిగింది. సమావేశానికి పెద్ద ఎత్తున కాపు నాయకులు, కాపు, బలిజ సంఘీయులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కాపులను తన గుండెల్లో పెట్టుకొని గౌరవిస్తున్నారన్నారు. కాపులను అవమానించి, రంగా వంటి మహోన్నత నేత హత్యకు కారణమైన టీడీపీతో పవన్‌కల్యాణ్ కలిసి పోటీ చేయటం కాపులను అవమానించటమేనన్నారు. అందువల్లనే రాష్ట్రంలో కాపుల కోసం పోరాడిన అనేక మంది కాపు పోరాటయోధులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నారని చెప్పారు. కాపులకు ఉపముఖ్యమంత్రి పదవితో పాటుగా నలుగురు మంత్రి పదవులు, ప్రభుత్వ విప్‌లు, చైర్మన్లు ఇతర ఉన్నతమైన గౌరవాన్ని కల్పించే దిశగా జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపించారన్నారు. జనసేన 24 సీట్లతో పోటీ చేస్తుంటే వైఎస్సార్ సీపీ ఇప్పటికీ పాతిక అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ సీట్లను కాపులకు ప్రకటించిందన్నారు. కాపు అక్కచెల్లమ్మలకు కాపు నేస్తం పేరుతో ప్రతి ఏటా రూ.18 వేలను అందిస్తోందని చెప్పారు. ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే ఐదుగురు కాపు కార్పొరేటర్లు ఉన్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి కాపులంతా అండగా ఉండాలన్నారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాపులకు అత్యధిక ప్రాధాన్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి జగన్‌మోహన్‌రెడ్డి అందించిన చేయూత మరే పార్టీ అందించలేదన్నారు. కాపులకు అత్యధిక ప్రాధాన్యత తమ పార్టీ మాత్రమే అందించిందన్నారు. నగరంలో 400 గజాల స్థలాన్ని కాపు కమ్యూనిటీ హాల్ నిమిత్తం జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారని వివరించారు. కాపు జాతీయ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఏపీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సభ్యుడు నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కాపులను ఇంత పెద్ద సంఖ్యలో రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. కాపులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన జగన్‌కు తమందరం అండగా ఉంటామన్నారు. సీనియర్ కాపు నేత ఆకుల శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. కాపులు టీడీపీ, బీజేపీ కూటమిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. గతంలో కాపులను టీడీపీ ఘోరంగా అవమానించిందన్నారు. టీడీపీ కూటమిని ఓడించేందుకు కాపులందరూ ముందుకు రావాలన్నారు. కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మహాదేవు అప్పాజీరావు, పార్టీ సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావులు మాట్లాడుతూ కాపులందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, లావణ్య మాధురి, అత్తులూరి ఆదిలక్ష్మి, చైతన్యరెడ్డి, నాయకులు అత్తులూరి పెదబాబు, కూరాకుల నాగ, పదిలం రాజశేఖర్, మాధవరావు, ఆలుమూరి సాంబశివరావు, ఏలూరు వెంకన్న, శంభాని శ్రీను, బత్తుల దుర్గారావు, సురకాశి శ్రీను, కె.కనకారావు, కంచు బాబు, చింతపల్లి కేశవ రమణారావు, పడాల రాజేష్, కర్రి గౌరి, దొడ్ల రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్, వేదికపై మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

రాష్ట్రంలో ప్లంబింగ్ సేవల అభివృద్ధికి కృషి

ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్లంబింగ్ నిపుణుల సేవలు వృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి అన్నారు. ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ అమరావతి చాప్టర్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు జల వనరుల పునరుజ్జీవానికి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎలా అమలు చేశారో తెలిపారు. అసోసియేషన్‌కు అవసరమైనప్పుడు తన మద్దతు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సందీపని వజ్జె మాట్లాడుతూ నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కార్యదర్శి కిరణ్ పర్చూరి, వైస్ చైర్మన్ బి.ఆనంద్‌బాబు, కోశాధికారి పి.అనూష, సంయుక్త కార్యదర్శి ఆర్.కోమల్ గిల్డా, కార్యనిర్వాహక సభ్యులు రవికిరణ్ గోగినేని, వెంకటేశ్వరరావు రావిపూడి తదితరులు ఉన్నారు. నారెడ్కో, క్రెడాయ్, బీఏఐ వంటి నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులతో రాజశేఖరరెడ్డి

లారీ డ్రైవర్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవర్‌ను బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.... ఏలూరుకు చెందిన ఎన్.రామకృష్ణ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి ఏలూరుకు లారీలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి లారీ గొల్లపూడి ఎట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు వద్దకు రాగానే ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి లారీని అడ్డగించారు. తాము మీడియా అని, లారీ ఓనర్‌కు ఫోన్ చేయమని డ్రైవర్‌ను ఒత్తిడి చేశారు. మీడియా కార్డులు చూపించి చికెన్ వేస్ట్ రవాణా చేయకూడదని బెదిరించారు. డ్రైవర్ లారీ ఓనర్‌కు ఫోన్ చేసి వాళ్ల చేత మాట్లాడించాడు. అనంతరం తమకు రూ.15వేలు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని డ్రైవర్‌ను బెదిరించారు. డ్రైవర్ తన వద్ద రూ.2 వేలు మాత్రమే ఉన్నాయనగా వాటిని లాక్కున్నారు. ఇంతలో పోలీసు సైరన్ వినబడడంతో ముగ్గురు వ్యక్తులు పారిపోయారని లారీ డ్రైవర్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్‌ను బెదిరించిన కటారి వెంకన్న, కాలసాని వెంకన్న బాబు, మహేష్ బాబు అను ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలను తరలిస్తున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.



